# బీజేపీకి రూ.6,060 కోట్ల బాండ్లు

▸ మొదటిపేజీ తరువాయి...

ఎవరెవరు నిధులు ఇచ్చారు ? ఎన్ని నిధులు ఇచ్చారు ? అనే వివరాలు వెల్లడి కాలేదు.

**అత్యధికం బీజేపీకే**

దేశంలోనే అత్యధికంగా అధికార భారతీయ జనతా పార్టీ రూ.60,60.5 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అందుకుంది. ఎన్‌క్యాష్ చేసుకున్న బాండ్లలో దాదాపు 47% వాటా బీజేపీదే. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రూ.1600 కోట్లకుపైగా, కాంగ్రెస్ పార్టీకి రూ.1400 కోట్లకుపైగా నిధులు బాండ్ల ద్వారా అందాయి. కాగా, అన్ని పార్టీలకు ఆయా పార్టీల పేర్ల మీద ఎన్నికల బాండ్లు అందగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు మాత్రం అధ్యక్షుల పేర్లతో బాండ్లు అందాయి.

**'లాటరీ కింగ్'వే ఎక్కువ బాండ్లు**

ఎక్కువ ఎలక్టోరల్ బాండ్లను కోయంబత్తూరు కేంద్రంగా పని చేసే ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ కొనుగోలు చేసింది. వేర్వేరు పేర్లతో ఈ సంస్థ కేరళ, సిక్కిం తదితర రాష్ట్రాల్లో లాటరీ వ్యాపారం నిర్వహిస్తున్నది. ఈ సంస్థ రూ.1,368 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. లాటరీ కింగ్‌గా పేరున్న మార్టిన్ శాన్‌టియాగో ఈ సంస్థకు




యాజమాని. ఈ సంస్థపై మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ విచారణ జరుపుతున్నది.

**వివరాల్లో వ్యత్యాసం ఎందుకు: కాంగ్రెస్**

ఈసీ వెల్లడించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలపై కాంగ్రెస్ పార్టీ పలు అనుమానాలను లేవనెత్తింది. దాతల వివరాల్లో 18,871 ఎంట్రీలు ఉండగా, బాండ్లు అందుకున్న వారి వివరాల్లో 20,421 ఎంట్రీలు ఎందుకున్నాయని, ఈ వ్యత్యాసానికి కారణమేంటని కాంగ్రెస్ నేత అమితాబ్ దూబే ఎక్స్‌లో ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని 2017లో ప్రవేశపెట్టగా ఇప్పుడు వెల్లడించిన వివరాల్లో మాత్రం 2019 ఏప్రిల్ నుంచే ఎందుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

**నేడు ఈసీ వినతిపై విచారణ**

ఎలక్టోరల్ బాండ్ల కేసులో మార్చి 11న సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఎన్నికల కమిషన్ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం విచారించనుంది. ఇంతకుముందు ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్లను ఈసీ కార్యాలయంలో పెట్టాలని సుప్రీంకోర్టు మార్చి 11న ఈసీని ఆదేశించింది. అయితే, పారదర్శకత పాటించేందుకు గానూ ఈ డాక్యుమెంట్ల కాపీలను తమ వద్ద పెట్టుకోలేదని, కాబట్టి కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను తిరిగివ్వాల్సిందిగా సుప్రీంకోర్టును ఈసీ కోరింది.




### ఎలక్టోరల్ బాండ్లు ఎక్కువగా కొనుగోలు చేసిన సంస్థలు

| దాత పేరు | | రూ. కోట్లలో |
|---|---|---|
| ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ పీఆర్ | - | 1,368 |
| మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లి. | - | 966 |
| క్విక్ సప్లయ్ చైన్ ప్రైవేట్ లి. | - | 410 |
| వేదాంత లిమిటెడ్ | - | 400 |
| హల్దియా ఎనర్జీ లిమిటెడ్ | - | 377 |
| భారతి గ్రూప్ | - | 247 |
| ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ | - | 224 |
| వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లి. | - | 220 |
| కెవెంటర్ ఫుడ్‌పార్క్ ఇండియా లి. | - | 195 |
| మదన్‌లాల్ లి. | - | 185 |

### ఏయే పార్టీకి ఎన్ని నిధులు ?

| | | |
|---|---|---|
| ఆమ్ ఆద్మీ పార్టీ | - | రూ.65,45,00,000 |
| సమాజ్‌వాదీ పార్టీ | - | రూ.14,05,00,000 |
| అన్నా డీఎంకే | - | రూ.6,05,00,000 |
| తృణమూల్ కాంగ్రెస్ | - | రూ.16,09,53,14,000 |
| బీఆర్‌ఎస్ పార్టీ | - | రూ.12,14,70,99,000 |
| బీజేపీ | - | రూ.60,60,51,11,000 |
| జేడీయూ | - | రూ.14,00,00,000 |
| బీజేడీ | - | రూ.7,75,50,00,000 |
| డీఎంకే | - | రూ.6,39,00,00,000 |
| గోవా ఫార్వర్డ్ పార్టీ | - | రూ.35,00,000 |
| నేషనల్ కాన్ఫరెన్స్ | - | రూ.50,00,000 |
| జనసేన పార్టీ | - | రూ.21,00,00,000 |
| జేడీఎస్ | - | రూ.43,50,00,000 |
| జార్ఖండ్ ముక్తి మోర్చా | - | రూ.13,50,00,000 |
| మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ | - | రూ.55,00,000 |
| ఎన్సీపీ(మహారాష్ట్ర శాఖ) | - | రూ.50,00,000 |
| ఎన్సీపీ(పార్లమెంటు) | - | రూ.30,50,00,000 |
| కాంగ్రెస్ పార్టీ | - | రూ.14,21,86,55,000 |
| ఆర్జేడీ | - | రూ.73,50,00,000 |
| శిరోమణి అకాలీదళ్ | - | రూ.7,26,00,000 |
| శివసేన | - | రూ.1,59,38,14,000 |
| సిక్కిం డెమాక్రటిక్ ఫ్రంట్ | - | రూ.5,50,00,000 |
| సిక్కిం క్రాంతికారి మోర్చా | - | రూ.36,50,00,000 |
| తెలుగుదేశం పార్టీ | - | రూ.2,18,88,00,000 |
| వైఎస్సార్సీపీ | - | రూ.3,37,00,00,000 |

# హంగ్ వస్తే మళ్లీ ఎన్నికలు

▸ మొదటిపేజీ తరువాయి...

గత సెప్టెంబర్‌లో కేంద్రప్రభుత్వం కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది.

**కోవింద్ కమిటీ కీలక సిఫారసులు**

- జమిలి ఎన్నికల నిర్వహణకు రెండంచెల విధానాన్ని సూచిస్తున్నాం. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏక కాలంలో పోలింగ్ నిర్వహించాలి.

ఆ తర్వాత 100 రోజుల్లోగా మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలి. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉన్నది. అవి.. పార్లమెంట్ కాలవ్యవధికి సంబంధించిన రాజ్యాంగంలోని 83వ అధికరణం, లోక్‌సభ రద్దుకు సంబంధించిన 85వ అధికరణం, రాష్ట్రాల అసెంబ్లీల కాలవ్యవధికి సంబంధించిన 172వ అధికరణం, శాసనసభల రద్దుకు సంబంధించిన 174వ అధికరణం, రాష్ట్రపతి పాలనకు సంబంధించిన 356వ అధికరణాలను సవరించాల్సి ఉంటుంది.

- హంగ్ పార్లమెంట్ లేదా హంగ్ అసెంబ్లీ వస్తే కొత్తగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి.
- అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలు ఎదురైనప్పుడు కూడా మిగతా కాలవ్యవధికి గానూ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలి.
- కొత్త ఎన్నికలను మధ్యంతర ఎన్నికలుగానే వ్యవహరించాలి.
- మధ్యంతర ఎన్నికల ద్వారా కొత్తగా ఏర్పడిన సర్కారు పాలనకాలం మిగిలిన కాలవ్యవధి వరకు మాత్రమే ఉంటుంది. అంటే రెండేండ్లకు ఏదైనా సర్కారు కూలిపోతే, కొత్తగా నిర్వహించిన ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం పదవీకాలం మూడేండ్లకే పరిమితమవుతుంది.
- లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థలు ఇలా.. ఈ మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలి. దీనికోసం రాజ్యాంగంలోని 325 అధికరణంలో సవరణలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్ర ఎన్నికల సంఘాలతో సంప్రదింపులు జరుపాల్సి ఉంటుంది.



రాష్ట్రపతి ముర్ముకు జమిలి ఎన్నికల నివేదికను సమర్పిస్తున్న ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు

**బలప్రదర్శన ఉండదా?**

అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలు ఎదురై ప్రభుత్వం పడిపోతే, బల ప్రదర్శన ద్వారా మెజారిటీ చూపించుకొన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఇప్పటివరకూ ఆహ్వానిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలు ఎదురైనప్పుడు కూడా మిగతా కాల వ్యవధికి గానూ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని కమిటీ సిఫారసు చేసింది. అంటే, అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వం పడిపోతే, బలప్రదర్శన అనేది ఇకపై ఉండబోదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఎన్ని పార్టీలు మద్దతిచ్చాయి?**

191 రోజుల పాటు జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ అధ్యయనం జరిపింది. పలు రంగాల నిపుణులతో విస్తృతమైన సమావేశాలు నిర్వహించింది. జమిలిపై అభిప్రాయాలను తెలుపాలంటూ 62 రాజకీయ పార్టీలను కమిటీ కోరగా.. 47 పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయి. ఇందులో బీజేపీ, అన్నాడీఎంకే వంటి 32 పార్టీలు జమిలికి మద్దతిచ్చాయి. కాంగ్రెస్, ఆప్, సీపీఎం వంటి 15 పార్టీలు వ్యతిరేకించాయి. బీఆర్‌ఎస్, ఎన్సీపీ, జేడీఎస్, ఆర్జేడీ, టీడీపీ, వైసీపీ వంటి మరో 15 పార్టీలు స్పందించలేదు. వందలాది మంది ప్రజల నుంచి కూడా కమిటీ సలహాలు, సూచనలు కోరగా.. 21,558 స్పందనలు వచ్చాయి. వీరిలో 81 శాతం మంది ఏకకాల ఎన్నికలను సమర్థించారు.

**కమిటీ ఎప్పుడు ఏర్పడింది? సభ్యులు ఎవరు?**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో గత సెప్టెంబర్ 2న ఈ కమిటీని కేంద్రం నియమించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాంనబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాశ్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా నియమించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, కమిటీ కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రకు బాధ్యతలు అప్పగించారు.

**ఏడు దేశాలపై అధ్యయనం**

దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పిన్స్ దేశాల్లో ఏకకాల ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో నివేదికను సమర్పించే కంటే ముందు కమిటీ సభ్యులు ఆయా దేశాల్లో ఎన్నికల నిర్వహణ తీరుపై లోతైన విశ్లేషణ చేపట్టారు.

**'లా కమిషన్' నివేదిక కూడా..**

'ఒకే దేశం...ఒకే ఎన్నిక' అంశంపై లా కమిషన్ కూడా తమ నివేదికను దాదాపుగా సిద్ధం చేసినట్టు సమాచారం. త్వరలోనే న్యాయశాఖకు ఈ నివేదికను సమర్పించనున్నట్టు తెలుస్తున్నది. కాగా, 'జమిలి'పై కోవింద్ కమిటీ లా కమిషన్ అభిప్రాయాన్ని కోరగా.. ఏకకాల ఎన్నికల నిర్వహణను లా కమిషన్ సమర్థించినట్టు సమాచారం.

**ఎన్నికల సంఘం నివేదిక కూడా..**

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన అనంతరం 1967 వరకూ నాలుగు మార్లు దేశంలో ఏకకాల ఎన్నికలే జరిగాయి. అయితే, ప్రభుత్వాలు మధ్యలో కూలిపోవడం తదితర కారణాలతో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగే ఎన్నికల తేదీల్లో మార్పులు వచ్చాయి. దేశంలో ఏకకాల ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై 2015లో ఎన్నికల సంఘం (ఈసీ) కూడా ఒక నివేదికను సమర్పించింది. జమిలి ఎన్నికలకు ఈసీ మద్దతు ప్రకటించింది. అయితే, ఈ ప్రతిపాదనలను ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయి.

### జమిలి ఎన్నికలకు మద్దతు ఎందుకంటే?

జమిలి ఎన్నికలు దేశాభివృద్ధిని, సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తాయని కోవింద్ కమిటీ నివేదికలో అభిప్రాయపడింది. ఏకకాల ఎన్నికలు ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేస్తాయని, భారత జాతి ఆకాంక్షలు సాకారమవ్వడానికి సహకరిస్తాయని తెలిపింది. తరుచూ ఎన్నికలు జరిగితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ పాలన కుంటుపడుతుందన్న కమిటీ.. పాలసీల అమల్లో జాప్యం జరుగుతుండటంతో దేశ ఆర్థిక ప్రగతికి ఇది ఓ విధంగా గొడ్డలిపెట్టుగానే మారుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కారణాల వల్లే ఏకకాల ఎన్నికలకు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తున్నట్టు వివరించింది.

# పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గింపు

### ఎన్నికల ముందు మోదీ సర్కార్ తాయిలం

న్యూఢిల్లీ, మార్చి 14: లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం వరాల వర్షం కురిపిస్తున్నది. మొన్నటికి మొన్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గించిన కేంద్రం.. తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.2 తగ్గించింది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి గురువారం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. తగ్గించిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. ఇంధన ధర రూ.2 తగ్గించటం ద్వారా కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను



మోదీ ఆదుకున్నారని సెలవిచ్చారు. వాస్తవానికి అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ కేంద్రం పెట్రో రేట్లను తగ్గించని విషయం తెలిసిందే.

### టోఫెల్ స్కోర్‌ను అమెరికా వర్సిటీలు ధ్రువీకరించుకోవచ్చు

న్యూఢిల్లీ : అమెరికా విశ్వవిద్యాలయాలు ఇక నుంచి తమ భారతీయ అధ్యయన-విదేశీ భాగస్వాముల ద్వారా టోఫెల్ పరీక్ష స్కోర్‌ను ధ్రువీకరించుకోవచ్చని ఈటీఎస్ (ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్) తాజాగా వెల్లడించింది. దక్షిణాసియాలో టోఫెల్, జీఆర్‌ఈ స్కోర్ వెరిఫికేషన్ కోసం 'కెరీర్ మొజాయిక్' సంస్థతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్టు ఈటీఎస్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అమెరికా విశ్వవిద్యాలయాలకు పరిపాలనా భారాన్ని తగ్గించేందుకు, విద్యార్థుల నమోదు ప్రక్రియ మరింత సమర్థంగా మార్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని 'ఈటీఎస్ ఇండియా' మేనేజర్ సచిన్ జైన్ ఈ సందర్భంగా చెప్పారు. అమెరికా, కెనడా, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని వర్సిటీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని కొలిచేందుకు 'టోఫెల్' పరీక్షను నిర్వహిస్తారు.

### స్పేస్‌ఎక్స్ 'స్టార్‌షిప్' ప్రయోగం మళ్లీ విఫలం

న్యూ మెక్సికో : ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రయోగించిన అతిపెద్ద రాకెట్ ప్రయోగం విఫలమైంది. గురువారం టెక్సాస్‌కు దక్షిణం వైపున మెక్సికో సరిహద్దు నుంచి స్టార్‌షిప్ వ్యోమనౌకను ప్రయోగించారు. గతంలో రెండు టెస్ట్ ఫ్లైట్‌లు ప్రయోగ సమయంలోనే విఫలం కాగా.. గురువారం నాటి స్టార్‌షిప్ మాత్రం విజయవంతంగా నింగిలోకి ఎగిరింది. నిర్దేశించిన సమయానికి రాకెట్ నుంచి బూస్టర్ సైతం వేరు పడింది. దీంతో ప్రయోగం విజయవంతమవుతుందని భావిస్తుండగానే రాకెట్ నుంచి సంబంధాలను కోల్పోయినట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు.

### సైనిక్ స్కూళ్ల ప్రవేశ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సైనిక్ పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాల్ని (ఏఐఎస్‌ఎస్‌ఈఈ-2024) నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్ (exams.nta.ac.in/AISSEE) సందర్శించాలని అధికారులు తెలిపారు. 6, 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం జనవరి 28న దేశవ్యాప్తంగా 185 నగరాల్లోని 450 సెంటర్లలో 'ఏఐఎస్‌ఎస్‌ఈఈ-2024' ప్రవేశ పరీక్షను నిర్వహించారు.



వితరణ శీలి, రచయిత్రి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి(73) గురువారం రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు.

### రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత చికిత్స

**పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించిన కేంద్రం**

న్యూఢిల్లీ, మార్చి 14: రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం తీసుకువస్తున్నది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించనున్నారు. 'చండీగఢ్‌లో పైలట్ ప్రోగ్రామ్ ప్రారంభించాం. రోడ్డు ప్రమాద బాధితులకు సరైన సమయంలో వైద్య చికిత్స అందించాలన్నది ముఖ్య ఉద్దేశం. ప్రమాదం జరిగిన రోజు నుంచి గరిష్టంగా 7 రోజులపాటు, రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుతుంది' అని కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. పైలట్ ప్రోగ్రామ్‌లో వచ్చే ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా పథకాన్ని అమలుజేస్తామని వెల్లడించింది.

### పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో 20% ఉద్యోగులపై వేటు!

న్యూఢిల్లీ, మార్చి: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(పీపీబీఎల్) 20 శాతం మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉన్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొన్ని కీలక పీపీబీఎల్ ఆపరేషన్లను ఆర్బీఐ ఈ నెల 15 నుంచి సీజ్ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ కోతలు ఉండవచ్చని తెలుస్తున్నది. బ్యాంక్‌పై ఆర్బీఐ చర్యలు తీసుకొన్నప్పటి నుంచి పేటీఎం షేర్ల విలువ 50 శాతం వరకు పడిపోయాయి. అయితే వార్షిక పనితీరు మదింపును సాకుగా చూపి తక్కువ రేటింగ్స్ ఉన్న ఉద్యోగులను రాజీనామా చేయాలని కోరుతున్నారని పీబీఎల్‌కు చెందిన ఒక ఉద్యోగి చెప్పినట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని పేటీఎం అధికార ప్రతినిధి ఖండించారు.

### దివ్యాంగుల పథకాలకు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ, మార్చి 14: దివ్యాంగులకు సంబంధించిన ఆరు ఉపకార వేతనాలు, ఆరు పథకాల వర్తింపునకు కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కార్డును తప్పనిసరి చేసింది. ఒక వేళ ఆధార్ నంబర్లు లేకపోయినట్టయితే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ స్లిప్‌తోపాటు పలు ఇతర పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

# ఎన్నికల కమిషనర్లుగా సుఖ్‌బీర్, జ్ఞానేశ్

- కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్
- కమిషనర్ల నియామకాలపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర న్యాయ శాఖ గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కమిటీ వీరిని ఎంపిక చేసింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘానికి రాజీవ్ కుమార్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. కమిషనర్‌గా ఉన్న అనూప్ చంద్ర పాండే గత నెలలో పదవీ విరమణ చేయగా.. మరో కమిషనర్ అరుణ్ గోయెల్ ఇటీవల అనూహ్యంగా రాజీనామా చేశారు. కేరళకు చెందిన కుమార్, ఉత్తరాఖండ్‌కు చెందిన సంధూ ఇద్దరూ 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసిన సందర్భంలో కుమార్ హోంమంత్రిత్వ శాఖలో



సుఖ్‌బీర్ సంధూ | జ్ఞానేశ్ కుమార్

సేవలు అందించగా, సంధూ గతంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. కాగా, ఎన్నికల కమిషనర్ల ప్రక్రియపై ఎంపిక కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధరీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

**నేడు సుప్రీంలో విచారణ**

ఈసీ కమిషనర్ల ఎంపిక ప్రక్రియపై సుప్రీంలో నేడు విచారణ జరగనుంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్‌ల నియామక కమిటీ నుంచి సీజేఐని తప్పించి ఆ స్థానంలో క్యాబినెట్ మంత్రిని చేర్చటాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

### మానవాభివృద్ధి సూచీలో భారత్ ర్యాంకు 134

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచీలో భారత్ ఒక ర్యాంకు మెరుగుపర్చుకుంది. 2022 ఏడాదికి సంబంధించి 193 దేశాలకు గానూ 134వ ర్యాంకు సాధించింది. అంతకుముందు ఏడాది 135వ స్థానంలో నిలిచింది. లింగ అసమానత సూచీ (జీఐఐ) విషయానికొస్తే 2022లో 193 దేశాలలో 108వ ర్యాంకు పొందగా, 2021లో 191 దేశాలలో 122వ ర్యాంకు సాధించింది. ఇక యూఎన్‌డీపీ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అసమానత పెరిగిపోతున్నది.

### మమతకు తీవ్ర గాయం

**ఇంట్లో కిందపడటంతో నుదుటికి దెబ్బ**

కోల్‌కతా, మార్చి 14: బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా గాయపడ్డారు. 69 ఏండ్ల దీదీ గురువారం సాయంత్రం ఒక కార్యక్రమానికి హాజరై తన ఇంటికి వచ్చారు. ఇంట్లో పడిపోవటంతో ఆమె నుదుటిపై పెద్ద గాయం అయ్యిందని, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వెంటనే దవాఖానకు తరలించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. 'మమతా బెనర్జీ నుదుటిపై పెద్ద గాయం అయ్యింది. ఆమె స్వస్థత కోసం ప్రజలు ప్రార్థన చేయాలి' అని పేర్కొంటూ నుదుటి నుంచి రక్తం వస్తున్న ఆమె ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశాయి.

### 18 ఓటీటీలపై కేంద్రం నిషేధం

- మరో 19 వెబ్‌సైట్స్, 10 యాప్‌లు 57 సోషల్ మీడియా ఖాతాలపైనా..
- అశ్లీల కంటెంట్ ప్రసారం చేస్తుండటంతోనే..

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): అశ్లీల కంటెంట్, అభ్యంతరకర చిత్రాలు, నగ్న వీడియోలను ప్రసారం చేస్తున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై కేంద్రప్రభుత్వం కొరడా ఝుళిపించింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను తొలగించినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తొలగించిన ఓటీటీ యాప్‌లలో ఒక యాప్‌నకు కోటికి పైగా డౌన్‌లోడ్స్ ఉండగా.. మరో రెండు యాప్‌లకు 50 లక్షల చొప్పున డౌన్‌లోడ్స్ ఉన్నట్టు కేంద్రం తెలిపింది.

**నిషేధం వేటిపై?**

- తొలగించిన ఓటీటీలు-18 (డ్రీమ్ ఫిల్మ్స్, వూవీ, యెస్మా, అన్‌కట్ అడ్డా, ట్రై ఫ్లిక్స్, ఎక్స్ ప్రైమ్, నియాన్ ఎక్స్ వీఐపీ, బేషరమ్స్, హంటర్స్, ర్యాబిట్, ఎక్స్‌ట్రా మూడ్, న్యూఫ్లిక్స్, మూడ్‌ఎక్స్, మోజ్‌ఫ్లిక్స్, హాట్‌షాట్స్ వీఐపీ, ఫుగీ, చికూఫ్లిక్స్, ప్రైమ్‌ప్లే)
- తొలగించిన యాప్‌లు – 10 (గూగుల్ ప్లేస్టోర్-7, యాపిల్ యాప్ స్టోర్-3)
- సోషల్‌మీడియా అకౌంట్లు – 57 (ఫేస్‌బుక్-12, ఇన్‌స్టాగ్రామ్-17, ఎక్స్-16, యూట్యూబ్-12)



తాగునీటి కోసం బెంగళూరులో ధర్నా చేస్తున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సభ్యులు

# బెంగళూరుకు నీటి సమస్యే లేదట!

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే వెల్లడి
- పాఠశాలల్లో తాగడానికి నీళ్లే లేవు
- ట్యాంకర్లు ఏర్పాటు చేయని సర్కారు
- ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద ప్రజల బారులు
- అయినా పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- డీకే వ్యాఖ్యలపై ప్రతిపక్షాల విమర్శలు

బెంగళూరు, మార్చి 14: నీళ్లు లేక కర్ణాటక అల్లాడుతున్నది.. ఒక్క బెంగళూరు నగరంలోనే 7 వేల బోర్లు ఎండిపోయాయి.. పాఠశాలల్లోనూ విద్యార్థులకు నీటిని అందించలేని దుస్థితి. అయినా.. అసలు బెంగళూరులో నీటి సమస్య లేదని అంటున్నారు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. ప్రజల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. 'నగరంలో నీటి వనరులను గుర్తించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా సమయానికి నీళ్లను అందిస్తున్నాం. ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నది. బెంగళూరులో నీటి సంక్షోభమే లేదు. ఎవరికీ సమస్య రాకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నాం' అని తెలిపారు. డీకే వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. నెల రోజులుగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుంటే, సమస్య లేదనటంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. ప్రభుత్వమే ట్యాంకర్లు ఏర్పాటు చేస్తే, ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల వైపు ఎందుకు చూస్తున్నారని నిలదీస్తున్నాయి.

**60 శాతం మందికి ట్యాంకర్లే దిక్కు**

ఎన్నడూ లేనివిధంగా బెంగళూరులో నీటి సంక్షోభం తలెత్తింది. నగరంలోని 60 శాతం మందికి పైగా నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. నీటి కోసం జనం ట్యాంకుల వద్ద బారులు తీరుతున్న దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. స్కూళ్లలో విద్యార్థులకు తాగటానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడింది. నీటి కొరతతో పాఠశాలలను మూసివేస్తున్నారు. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. అటు బెంగళూరు నగర జలమండలి కూడా సరిపడా నీటిని సరఫరా చేయడం లేదు. డిమాండ్ ఎక్కువ అవటంతో ప్రైవేట్ ట్యాంకర్ల ఓనర్లు ధరలను అమాంతం పెంచేశారు. ఇలాంటి సమయంలో నీటి సంక్షోభంపై కాంగ్రెస్ పాలిత కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలు ప్రజల్లో ఆగ్రహావేశాలకు కారణం అవుతున్నాయి.

# కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా..

- డిమాండ్లు నెరవేర్చకపోతే లోక్‌సభ ఎన్నికల వేళ దేశవ్యాప్త ఉద్యమం
- కేంద్రానికి రైతు సంఘాల హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 14: కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతు సంఘాలు వెల్లడించాయి. తమ డిమాండ్లు నెరవేరకపోతే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉద్యమాన్ని విస్తరిస్తామని, లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఆందోళన కొనసాగిస్తామని కేంద్రాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన 'కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్' ఏకగ్రీవంగా తీర్మానించింది. అన్నదాతలకు వ్యతిరేకంగా కేంద్రం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలపై 2021 వరకు రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో తీవ్రంగా



తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేస్తున్న రైతులు

పోరాటం చేశారని, ఆ పోరాటం తర్వాత ఇంత పెద్ద యెత్తున దేశ రాజధానిలో రైతులు సభకు హాజరవ్వడం ఇదే ప్రథమమని బీకేయూ నేత రాకేశ్ టికాయత్ తదితరులు పేర్కొన్నారు.

**నినాదాలతో హోరెత్తిన రామ్‌లీలా**

కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై కర్షక లోకం మండిపడింది. మోదీ వ్యతిరేక నినాదాలతో రామ్‌లీలా మైదానం దద్దరిల్లింది. 'కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్' సభకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన రైతులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దయెత్తున నినాదాలు చేశారు. కాగా ఈ సభకు పలు ఆంక్షలు విధిస్తూ పోలీసులు అనుమతి మంజూరు చేశారు.

# సీఏఏను ఎప్పటికీ వెనక్కు తీసుకోం

**రాజీపడే ప్రసక్తే లేదు: అమిత్ షా**

న్యూఢిల్లీ, మార్చి 14: ఒకవైపు పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుకు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతుండగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. సీఏఏ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఈ చట్టాన్ని ఎప్పటికీ వెనక్కు తీసుకోబోమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన ఏఎన్ఐ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..సీఏఏ రాజ్యాంగ విరుద్ధం కాదని, ఆర్టికల్ 14ను ఇది ఉల్లంఘించడం లేదని పేర్కొన్నారు. సీఏఏ ద్వారా రాజకీయ లాభనష్టాల గురించి తాము ఆలోచించడం లేదని, 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనే సీఏఏ తీసుకువచ్చి పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ శరణార్థులకు భారత పౌరసత్వం ఇస్తామని ప్రకటించామని అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సీఏఏను వెనక్కు తీసుకుంటామని కాంగ్రెస్ నేతలు చేసిన ప్రకటనపై అమిత్ షా స్పందించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాదని కూటమి నేతలకూ తెలుసని పేర్కొన్నారు. సీఏఏ ద్వారా దేశంలో నేరాలు పెరుగుతాయని, యువత ఉద్యోగాలు కోల్పోతారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను షా తప్పుబట్టారు. సీఏఏ ద్వారా ప్రయోజనం పొందబోయే భారత్‌లో ఉన్నారని గుర్తు చేశారు. చట్టం అమలు కేంద్రం అంశమని, రాష్ట్రాలు అడ్డుకోలేవని స్పష్టంచేశారు. చట్టం అమలుచేయబోమని కేరళ, బెంగాల్, తమిళనాడు సీఎంలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

